ప్రజాశక్తి
శనివారం 9 మార్చి 2024 5 విజయనగరం



ఫిజియోథెరపీ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో 2 భవిత క్లస్టర్‌లో హవర్ బేసిస్‌లో ఫిజియోథెరపిస్ట్ గా పనిచేసేందుకు బ్యాచలర్ ఆఫ్ ఫిజియో థెరపీ, ఎంపిటి అర్హత గల అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 10 చివరి తేదీ అని తెలిపారు. అర్హతకు సంబంధించిన వివరాల కోసం vizianagaram.nic.in వెబ్‌సైట్ ద్వారా పొందువచ్చుననీ తెలిపారు. నింపిన దరఖాస్తులను సమగ్ర శిక్షా, జిల్లా సమగ్ర శిక్షా కార్యాలయం, విజయనగరంలో ఈనెల 10 సాయంత్రం 5గంటలకు సమర్పించాలని పేర్కొన్నారు. స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. గౌరవ వేతనం క్యాంప్ ఒక్కింటికి రూ.1000 చొప్పున 12 క్యాంపులకు నెలకు రూ.12 వేలు చెల్లిస్తామని తెలిపారు.

ఘనంగా మహిళా దినోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మహిళా దినోత్సవ వేడుకలు శుక్రవారం పలుచోట్ల ఘనంగా జరిగాయి. కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎస్‌పి ఎం.దీపికపాటిల్‌ను రెవిన్యూ అధికారులు ఘనంగా సన్మానించారు. డిఆర్‌ఒ ఎస్.డి.అనిత, ఆర్‌డిఒలు ఎం.వి.సూర్యకళ, సాయిశ్రీ, బి.శాంతి తదితరులు జిల్లా అధికారులను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్‌జిఒ హోంలో శుక్రవారం ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు జరిగాయి. అన్ని శాఖలు నుండి సుమారు 300మంది మహిళా ఉద్యోగులు హాజరయ్యారు. ముఖ్య అతిధులుగా ఐసిడిఎస్ పీడీ బి.శాంత కుమారి, సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ అనిలా సునందిని, ఎపి జిఎల్ఐ డైరెక్టర్ హైమావతి, జిల్లా ఆడిట్ అధికారి బి.అరుణ కుమారి పాల్గొన్నారు. ఆటల పోటీలలో గెలుపొందిన మహిళలు కు బహుమతి ప్రదానం చేశారు. అనంతరం పలువురు మహిళలను సత్కరించారు. ఎన్‌జిఒ మహిళా విభాగం నాయకులు ఆర్.శ్రీస్వప్న, ఆదిలక్ష్మి, ప్రసన్న కుమారి, వి.కోటేశ్వరి పి.లత, పి.శివలక్ష్మి జ్యోతిర్మయి, శ్రీవిద్య, రాధిక, తదితరులు జిల్లా పట్టణ కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు. జిల్లా కార్యదర్శి సురేష్, పట్టణ అధ్యక్షులు రాజు,సుధ, చంద్ర శేఖర్ ఉపాధ్యక్షులు ఆనంద్ కుమార్, కె బి శ్రీను, శ్రీధర్ బాబు, గోపీనాథ్ పాల్గొన్నారు.

కలెక్టర్ నాగలక్ష్మికి జ్ఞాపికను అందజేస్తున్న ఆర్‌డిఒ సూర్యకళ

మహిళా కార్మికులకు సత్కారం

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి స్వగృహంలో డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి ఆధ్వర్యంలో మహిళా పారిశుధ్య కార్మికులకు సత్కరించారు. మేయరు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, ఎఎంసి చైర్మన్ శశిభార్గవి మాట్లాడుతూ నగరంలో పారిశుధ్య పరిరక్షణలో మహిళా కార్మికుల పాత్ర కీలకమని అన్నారు. కార్యక్రమంలో మహిళా కార్పొరేటర్లు పాల్గొన్నారు.

మహిళల హక్కులకై పోరాడుదాం : సమతా

మహిళా దినోత్సవం స్ఫూర్తితో హక్కుల సాధనకు ఉద్యమాలను ఉధృతం చేయాలని జెవివి సమతా రాష్ట్రకన్వీనర్ జి.నిర్మల పిలుపునిచ్చారు. యుటిఎఫ్ కార్యాలయంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జరిగిన సదస్సులో ఆమె మాట్లాడారు. దేశంలో బిజెపి అధికారంలోకి వచ్చాక మహిళల పరిస్థితి దారుణంగా మారిందన్నారు. ఒకవైపు భ్రూణ హత్యలలో ప్రపంచంలోనే

పలుచోట్ల మహిళలకు సత్కారం

భారత దేశం మొదటి స్థానంలో ఉందని,లైంగిక దాడులు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నూతన సంస్కృతి పేరుతో విదేశీ కల్చర్, పబ్ లు, సినిమాల్లో విచ్చలవిడి శృంగారం సన్నివేశాల చిత్రీకరణ, సెల్‌ఫోన్లు వచ్చాక అశ్లీల వీడియోల ప్రభావం నేటి యువత పై తీవ్రంగా పడిందన్నారు. ఫలితంగా మహిళలపై హత్యలు, అత్యాచారాలు, దాడులు, పెరుగుతున్నాయన్నారు. స్కూల్స్ లో, కళాశాలల్లో, పనిప్రదేశాల్లో, అసభ్య ప్రవర్తనలు, లైంగిక దాడులు ఎదుర్కుంటున్నారన్నారు.నూతన ఆర్థిక విధానాల ఫలితంగా వ్యాపారీకరణ పెరగడంతో యువతుల ఆలోచన ధోరణి కూడా దాడులు పెరిగేందుకు దోహదం చేస్తుందన్నారు. వీటికి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులు పావని మాట్లాడుతూ మహిళలు ఆగ్రహించిన ప్రతి సందర్భంలోనూ అత్యాచారం చేసిన వారిని ఉరితీస్తే చాలు అనే భ్రమలకు గురిచేసి, పాలకులు చేతులు దులుపుకుంటున్నారని అన్నారు. ఇప్పటికీ దేశంలో తీసుకొచ్చిన నిర్భయ చట్టం అమలులో అధ్వానంగా ఉందన్నారు. ఐద్వా నగర అధ్యక్షులు కరుణ మాట్లాడుతూ రాష్ట్రంలో దిశ చట్టానికి ఎటువంటి దిశా లేదన్నారు. అత్యా చారం జరిగిన ప్రతి సందర్భంలోనూ మహిళలు వస్త్ర దారణపై మంత్రులు స్థాయిలోనే తీవ్రమైన వ్యాఖ్యలు చేయడం పరిపాటిగా మారిందన్నారు. మన తెలుగు రాష్ట్రాల్లో డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాలు, కొకైన్ అమ్మకాలు జోరుగా సాగుతున్నాయన్నారు. వీటిని నిర్మూలించడంలో పాలకుల వైఫల్యం ఉందన్నారు. యుటిఎఫ్ మహిళా నాయకులు శశికళ మాట్లాడుతూ నేటి బిజెపి పాలనలో మహిళలకు రక్షణ కరువవుతుందన్నారు. మహిళలపై దాడులను అరికట్టేందుకు, హక్కులు సాధనకు మనముందున్న ఏకైక కర్తవ్యం పోరాటమేనని అన్నారు. జెవివి నగర కార్యదర్శి చిన్నారి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో పలువురు మహిళలు పాల్గొన్నారు.

మహిళలను సన్మానిస్తున్న ఎన్‌జిఒలు

కార్యక్రమంలో మాట్లాడుతున్న సమతా రాష్ట్ర కన్వీనర్ నిర్మల

బొత్స నోట బెల్లాన మాట

- మరోసారి పార్లమెంట్ అభ్యర్థిగా చంద్రశేఖర్?
- వైసిపిలో మలుపు తిరుగుతున్న రాజకీయాలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లా వైసిపిలో రాజకీయాలు మలుపు తిరుగుతున్నాయి. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు యథాతథంగానే కొనసాగే అవకాశం ఉందా? అంటే ఔనన్‌ సమాధానమే గట్టిగా వినిపిస్తోంది. వైసిపి తరపున జిల్లా రాజకీయాలను శాశిస్తున్న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చిలకపలుకులే ఇందుకు నిదర్శమని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ముఖ్యంగా అత్యంత ఉత్కంఠ భరింతగావున్న విజయనగరం ఎంపీస్థానంలో తిరిగి పెదబాబే (బెల్లాన చంద్రశేఖర్) పోటీ చేస్తారంటూ నిన్నగాక మొన్న రాత్రి గరివిడి మండలం దేవాడలో చేసిన వ్యాఖ్యలు ఎంపీ అభ్యర్థి ఎవరు? అనేదానిపై దాదాపు క్లారిటీ ఇచ్చినట్టేనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అసెంబ్లీకి కూడా సిట్టింగ్ ఎమ్మెల్యేలనే కొనసాగించాలంటూ ఆయన చాలా రోజుల క్రితమే అధిష్టానానికి సూచిన చేసినట్టుగా సమాచారం. ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో జిల్లాలో దాదాపు రెండు నెలలుగా రాజకీయ వాతావరణం వేడెక్కిన విషయం విధితమే. జిల్లా పార్టీ సమన్వయ కర్త, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఎమ్మెల్యే లేదా ఎంపీగా పోటీచేసేందుకు ప్రయత్నిస్తున్నారని, ఎంపీగా ఆయనకు అవకాశం ఉండవచ్చని ప్రచారం జరిగిన సంగతి తెలిసిందే. ఆ తరువాత పార్టీ విడుదల చేసిన జాబితాలో విజయనగరం ఎంపీ, మినహా ఉత్తరాంధ్ర జిల్లాల్లో మిగిలిన స్థానాలన్నింటికీ అభ్యర్థుల పేర్లు బయటకు వచ్చాయి. శ్రీనివాసరావు పేరు బయటకు ప్రకటించకపోయినప్పటికీ అభ్యర్థి మాత్రం ఆయననే అని కూడా విస్తృత ప్రచారం సాగింది. ఎంపీగా బెల్లానను తప్పిస్తే, అందుకు తగిన అవకాశం ఇవ్వాలంటూ మంత్రి బొత్స సత్యనారాయణ అధిష్టానం దగ్గర గట్టిపట్టేపట్టారట. అంతకీ శ్రీనివాసరావును ఎంపీగా పంపాలనుకుంటే, జెడ్‌పి పీఠం బెల్లాన చంద్రశేఖర్ లేదా ఆయన కుటుంబ సభ్యుల్లో ఎవరికో ఒకరికి ఇవ్వాలని మంత్రి ప్రతిపాదన చేసినట్టుగా చర్చనడుస్తోంది. ఈ నేపథ్యంలోనే శ్రీనివాసరావు జెడ్‌పి పీఠాన్ని వదులుకునేందుకు ఇష్టపడలేదని తెలుస్తోంది. ఈ క్రమంలో కొత్తగా తలనొప్పులు లేకుండా ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులుగా సిట్టింగ్‌లనే ఉంచాలని అధిష్టానం భావిస్తున్నట్టు సమాచారం. అందువల్లే పార్టీలో కీలకంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో శ్రీనివాసరావును వైసిపి ఉత్తరాంధ్ర డిప్యూటీ సమన్వయకర్త బాధ్యత అప్పగించారని చర్చనడుస్తోంది. మరోవైపు మంత్రి బొత్స తాను కూడా తిరిగి చీపురుపల్లి నుంచే పోటీచేస్తానని క్లారిటీ ఇవ్వడంతో ఆయన అనుయాయుల్లో జోష్ నెలకుంది. మరో వారం రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉండడంతో ఈలోపే అభ్యర్థుల జాబితా అధికారికంగా వెలువడే అవకాశాలు కనిపిస్తున్నాయి.

నగర పంచాయతీల నియంత పాలన

- కొందరు నేతల తీరుతో పార్టీకి తీరని నష్టం
- పరిస్థితి మారకుంటే మూకుమ్మడి రాజీనామా
- సమావేశంలో వైసిపి కౌన్సిలర్లు, నేతల వెల్లడి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

నగర పంచాయతీలో నియంతపాలన కొనసాగుతోందని, దీనివల్ల పార్టీకి, ప్రభుత్వానికి తీవ్ర నష్టం కలుగుతోందని పలువురు వైసిపి కౌన్సిలర్లు, నాయకులు తెలిపారు. స్థానిక మొయిద జంక్షన్ వైసిపి కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జానా ప్రసాద్, కౌన్సిలర్లు మైపాడ ప్రసాద్, మొయిద శ్రీనివాసరావు, 16వ వార్డు కన్వీనర్ పాండ్రంకి సత్యనారాయణ, నాయకులు నక్కాన వెంకటరావు మాట్లాడుతూ మహా శివరాత్రి సందర్భంగా రామతీర్థం దర్శనార్థం పట్టణంలో కౌన్సిలర్లకు వంద పాసులు ఎమ్మెల్యే కేటాయించారని తెలిపారు. ఒక్కో కౌన్సిలర్‌కు కేవలం ఒక పాస్ మాత్రమే కమిషనర్ ఇచ్చారని దుయ్యబట్టారు. మిగిలిన పాసులు ఎవరికి అమ్ముకున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇటీవల భర్తీ చేసిన వార్డు వాలంటీర్ల పోస్టుల విషయంలో పట్టణానికి చెందిన నాయకులు, అధికారులు అడ్డగోలుగా వ్యవహరించారని ఆరోపించారు. ఒక్కో వాలంటీర్ పోస్టును రూ.30 వేల చొప్పున ఏడు పోస్టులను అమ్ముకున్నారని ధ్వజమెత్తారు. తమ వార్డుల్లో వాలంటీర్ పోస్టులను తమకు తెలియకుండా అమ్ముకోవడమే కాకుండా, సచివాలయ కన్వీనర్ పదవులను కూడా నచ్చిన వారికి కట్టబెట్టారన్నారు. పట్టణంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి అమ్ముకుంటున్నారని ఆరోపించారు. గతంలో రామతీర్థం మార్గంలో చంపావతి నది ఒడ్డున స్వర్గధామానికి స్థల పరిశీలన చేసి కొబ్బరికాయ కొట్టి ప్రస్తుతం మరోచోట నిర్మించడంలో ఆంతర్యం ఏమిటని ధ్వజమెత్తారు. కష్టపడే కౌన్సిలర్లకు, నాయకులకు ప్రాధాన్యత ఇవ్వకుండా టిడిపి నాయకులతో కుమ్మక్కు అయ్యారన్నారు. ఇప్పటికైనా పార్టీ పెద్దలు పట్టించుకోకపోతే పార్టీకి, ప్రభుత్వానికి తీరని నష్టం జరుగుతుందన్నారు. తమ పదవులకు మూకుమ్మడిగా రాజీనామా చేస్తామని ప్రజాప్రతినిధులు, నాయకులు హెచ్చరించారు. సమావేశంలో రెండో వార్డు కన్వీనర్ పైల మురళి, కాళ్ళ మహేష్, పార్థసారథి, మన్మథ తదితరులు పాల్గొన్నారు.

అంతా ఏకపక్షం!

- ఎల్లారమ్మ ఉత్సవ కమిటీ ప్రమాణ స్వీకారం
- గుట్టుచప్పుడు కాకుండా కార్యక్రమం
- ఎమ్మెల్యే సిఫార్సులపై పెదవి విరుస్తున్న సొంత పార్టీ నాయకులు

ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

ప్రజాశక్తి - జామి

వడ్డించేవాడు మనవాడైతే ఏ వరుసలో ఉన్నా... పర్వాలేదు అంటారు..! నిజమే జామి ఎల్లారమ్మ జాతర విషయంలో ఏకపక్షంగా వ్యవహరిస్తున్న అధికార పార్టీ తీరే అందుకు నిదర్శనం. సహజంగా ఎల్లారమ్మ ఉత్సవ ఏర్పాట్లు గ్రామ సర్పంచ్ నేతృత్వంలో గ్రామ పెద్దలంతా కలిసి నిర్వహిస్తారు. వాస్తవానికి దేవాదాయ శాఖ అధికారులు, మండల అధికార యంత్రాంగం తమ శాఖల విధుల్లో భాగంగా సహాయ సహకారాలు అందిస్తారు. కాని జామి జాతర విషయంలో పైన పేర్కొన్న వారి జోక్యం నామమాత్రమేనని వాపోతున్న పరిస్థితి. చివరికి అధికార పార్టీకి చెందిన నాయకులకు, గ్రామ ప్రజాప్రతినిధులుగా సేవ చేసిన వారికి కూడా ప్రాతినిధ్యం లేదన్న విమర్శలు ఉన్నాయి.

తాజాగా ఉత్సవ కమిటీ ఏర్పాటు తీరును పరిశీలిస్తే... ఉత్సవం ఏర్పాట్లలో ఏకపక్ష ధోరణి కొట్టొచ్చినట్లు కనిపిస్తుందని ఆ పార్టీ నాయకులే పెదవి విరుస్తున్న పరిస్థితి. ఈ నేపథ్యంలోనే ఎల్లారమ్మ ఉత్సవ కమిటీ ప్రమాణ స్వీకారం తీరు అందుకు ఆజ్యం పోస్తోంది. శుక్రవారం ఉత్సవ కమిటీ ప్రమాణ స్వీకారం ఆలయ ప్రాంగణంలో జరిగింది. ఈ కమిటీ నియామకం స్థానిక ఎమ్మెల్యే సిఫార్సులతో జరిగింది. అయినా ఆ పార్టీ పెద్దలకే చోటు దక్కలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు ఏకంగా ఈ కార్యక్రమానికి మీడియా మొదలుకుని, గ్రామ పెద్దలను కూడా దూరంగా పెట్టారన్న ఆరోపణలు ఉన్నాయి. కనీసం ఏ ఒక్కరికీ సమాచారం ఇవ్వకుండా గుట్టుచప్పుడు కాకుండా నిర్వహించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఉత్తరాంధ్రలో జామి ఎల్లారమ్మ జాతరకు ప్రత్యేక స్థానం ఉంది. ఏటా సుమారుగా మూణ్నాలుగు లక్షల మంది జాతరకు వస్తుంటారు. గతంలో అనేక ఇబ్బందులు జరిగినట్లు జనం ఆందోళన వ్యక్తం చేశారు. ఎండల తీవ్రతకు తగ్గట్టు కనీసం తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయలేదని ఆరోపణలు వినిపించాయి. క్యూలైన్లు ఏర్పాటు మొదలుకొని, టికెట్ విషయంలో అనేక అవకతవకలు జరిగాయన్నది గత జాతర విషయంలో వినిపిస్తున్న ఆరోపణలు. వీటన్నింటిపై సుదీర్ఘ చర్చలు జరిపి, గత తప్పిదాలు పునరావృతం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది. ఈ నేపథ్యంలో గుట్టుచప్పుడు కాకుండా ఉత్సవ కమిటీ ఏర్పాటు, ప్రమాణ స్వీకారం నిర్వహణపై అనేక అనుమానాలు వినిపిస్తున్నాయని అధికార పార్టీ నాయకులే మాట్లాడుతున్న పరిస్థితి. ఇప్పటికైనా ఉత్సవ ఏర్పాట్లపై అన్ని శాఖలు, గ్రామ పెద్దలు, స్వచ్ఛంద సంస్థలతో సమీక్ష నిర్వహించి, పండుగ వైభవంగా నిర్వహించాలని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

23న ఎస్.కోటలో చంద్రబాబు రోడ్‌షో

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ప్రజాగళం పేరుతో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఈ నెల 23న శృంగవరపుకోటలో రోడ్‌షో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోళ్ల లలితకుమారి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని అన్న కేంటీన్ వద్ద విలేకరులతో ఆమె మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో జనసేన-టిడిపి విజయం సాధించి, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాయని తెలిపారు. మహిళా సాధికారత కోసమే కలలకు రెక్కలు అనే సరికొత్త పథకాన్ని టిడిపి తీసుకొచ్చినట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు బీశెట్టి అరుణ, మాజీ ఎంపిటిసి గన్ను బంగారమ్మ పాల్గొన్నారు.

10న గురుకుల ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి- వేపాడ

గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్ష ఈ నెల 10న నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ టి.ఎం.ఫ్లోరెన్స్ తెలిపారు. 2024-25కు సంబంధించి 5వ తరగతి, ఇంటర్మీడియట్‌లో చేరేందుకు అవకాశం కల్పిస్తూ ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 5వ తరగతికి ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు, ఇంటర్మీడియట్‌కి మధ్యాహ్నం 2 గంటల నుండి 4.30 గంటల వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. https://apbragcet.apcfss.in వెబ్‌సైట్‌లో హాల్ టికెట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

సబ్‌జైలు భూములపై పె(గె)ద్దల కన్ను

- 200 ఎకరాల వరకూ కొల్లగొట్టేందుకు వ్యూహం
- డి పట్టా నేపథ్యంలో వారి పేరిట రిజిస్ట్రేషన్‌కు సన్నాహాలు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని కొండగంగుపూడి రెవెన్యూ పరిధిలోని సర్వే -1లో 200 ఎకరాల డి-పట్టా భూముల్లో ఓపెన్ సబ్ జైలు ఏర్పాటుకు ప్రభుత్వం గతంలో భూమిని సేకరించింది. ఈ భూములను అంతకు ముందే గిరిజనులకు ఇచ్చిన ప్రభుత్వం తిరిగి వారి వద్ద నుంచి తీసుకుని సబ్‌జైలుకు ఇచ్చేందుకు సన్నాహాలు చేసింది. ఇందుకోసం భూమి అభివృద్ధి చేసేందుకు అక్షరాలా రూ.కోటి ఖర్చు పెట్టి చదును చేసింది. ఇంత చేసిన ప్రభుత్వం చివరికి ఆ భూముల్లో సబ్ జైలు నిర్మించలేదు. తిరిగి ఆ భూములను గిరిజనులకు కూడా ఇవ్వలేదు. దీంతో కొంత మంది కబ్జాదారుల కన్ను ఆ భూములపై పడింది. విశాఖ జిల్లాకు చెందిన కొంది మంది రాజకీయ పలుకుబడి ఉన్న కబ్జాదారులు తప్పుడు సర్వే నెంబర్లు సృష్టించి డి-పట్టా భూములను వారి పేరుపై మార్చుకుని అమ్ముకునేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మరి కొందిమంది గతంలో పట్టాలిచ్చిన గిరిజనుల వద్దకు వెళ్లి ఎవరైనా అధికారులు వస్తే ఈ భూములు తమ ఆధీనంలోనే ఉన్నాయని చెప్పాలని దళారుల అవతారమెత్తిన కబ్జాదారులు గిరిజనులపై ఒత్తిడి తెస్తున్నారు. ఇదంతా రెవెన్యూ అధికారులు కనుసన్నల్లోనే జరుగుతుంది. ఇక ప్రభుత్వ భూములను కాపాడేది ఎవరంటూ ఆ ప్రాంతంలో కొంతమంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కె.జి.పూడిలో ప్రభుత్వ భూములు మాయాజాలంపై స్వయంగా జిల్లా కలెక్టర్ స్పందించి సర్వే చేస్తే తప్ప వాస్తవాలు వెలుగులోకి రావని వాదన వినిపిస్తుంది. సబ్‌జైలు నిర్మాణం జరగకపోతే ఆ భూములను తిరిగి నిజమైన గిరిజనులకు ఇవ్వాలన్న డిమాండ్ పెద్దఎత్తున వినిపిస్తోంది.

ఆక్రమణకు ప్రయత్నిస్తున్న భూమి ఇదే

ఎన్నికల విధులపై స్పష్టత ఉండాలి

కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

ఎన్నికల షెడ్యూలు వచ్చే లోగా ప్రతి అధికారి, సిబ్బంది ప్రవర్తన నియమావళిని అవగాహన చేసుకొని ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఎన్నికల రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో కలెక్టర్ శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సిబ్బందిని చిన్న గ్రూపులుగా విభజించి వారికి మాస్టర్ ట్రెయినీల ద్వారా శిక్షణ ఇస్తే వారికి పూర్తి అవగాహన ఏర్పడుతుందన్నారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు కోసం పలు బృందాలను నియమించామన్నారు.త్వరలో ఎన్నికల షెడ్యూలు విడుదల కానున్న దృష్ట్యా రిటర్నింగ్ అధికారులంతా తమ పరిధిలో పనిచేసే సిబ్బంది అందరినీ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం చేయాలన్నారు.

ముఖ్యంగా వృద్ధులు, విభిన్నప్రతిభావంతుల కోసం హోం ఓటింగ్ ప్రవేశపెట్టినందున దీనిపై శ్రద్ధ వహించి దీనిని ఎలా చేయాలనే అంశంపై సిబ్బందికి శిక్షణ ఇవ్వాలన్నారు. సెక్టోరల్ అధికారుల లభ్యతపై సమస్యలుంటే వెంటనే పరిష్కరించుకోవాలని చెప్పారు. ఇరవై నాలుగు గంటలూ పనిచేసేలా మూడు ల్యాండ్‌లైన్ ఫోన్ నెంబర్లతో కలెక్టరేట్‌లో ఒక కంట్రోల్‌రూం ఏర్పాటు చేస్తున్నామని, రిటర్నింగ్ అధికారులు కూడా తమ పరిధిలో ఒక ఫోన్ నెంబరుతో నిరంతరం సేవలు అందించేలా కంట్రోల్‌రూం ఏర్పాటు చేయాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్, వీడియో చిత్రీకరణ ఏర్పాట్లు తప్పనిసరిగా వుండాలన్నారు. సెక్టోరియల్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లకు వాహనాలు సమకూరుస్తున్నామని, వీటికి జి.పి.ఎస్.పరికరాలు అమర్చనున్నట్టు తెలిపారు. బ్యాలెట్ నమూనాలు వచ్చిన వెంటనే ఇ.వి.ఎం.లను ఏడు రోజుల్లో కమిషనింగ్ చేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, జిల్లా రెవిన్యూ అధికారి ఎస్.డి.అనిత, రెవిన్యూ డివిజనల్ అధికారులు ఎం.వి.సూర్యకళ, ఏ.సాయిశ్రీ, బొడ్డేపల్లి శాంతి, రిటర్నింగ్ అధికారులు ప్రమీలారాణి, ఎన్నికల విభాగం తహశీల్దార్ ప్రభాకరరావు పాల్గొన్నారు.

కౌంటింగ్ కేంద్రాల పరిశీలన

డెంకాడ : ఓట్ల లెక్కింపు కేంద్రాల ఏర్పాటు కోసం వివిధ కళాశాలల భవనాలను జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి శుక్రవారం పరిశీలించారు. ముందుగా డెంకాడ మండలం లెండి కళాశాలను సందర్శించారు. అక్కడ మ్యాప్ లను, భవనాలను క్షుణంగా పరిశీలించారు. కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటుపై ఆర్‌డిఒ ఎం.వి.సూర్య కళ, లెండి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వివి రమణా రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిబాబు, డాక్టర్ శైలజ తదితరులతో చర్చించారు. పర్యటనలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

జన జాతర

రామతీర్థం, పుణ్యగిరి ఆలయాలకు పోటెత్తిన యాత్రికులు

రామతీర్థం ఆలయం వద్ద జనాల రద్దీ

ప్రజాశక్తి-నెల్లిమర్ల

మహా శివరాత్రి జాతరను పురస్కరంచుకొని రామ తీర్థం రామ స్వామి దేవస్థానానికి శుక్రవారం వేలాది మంది జనం తరలివచ్చారు. తెల్లవారు జాము నుంచే భక్తులు రామ కోనేరులో స్నానాలు చేసి తలనీలాలు సమర్పించి సీతారామ స్వాములను దర్శించుకున్నారు. అంతే కాకుండా సంప్రదాయ ప్రకారం పూసపాటి రేగ, భోగాపురం మండలాలకు చెందిన మత్స్య కారులు జాతరకు వచ్చి తెల్ల వారు జాము వరకు కోలాటాలు నిర్వహించుకొని, అనంతరం దర్శనం చేసుకొని మొక్కులు తీర్చుకున్నారు. మిగతా భక్తులంతా సీతాసమేత రామ లక్ష్మణ స్వాములను, అనంతరం దేవస్థానం క్షేత్ర పాలకుడు ఉమా సదా శివ స్వామిని కూడా దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. రెండు రోజుల పాటు జరిగే శివరాత్రి జాతర లో భక్తులు వంటలు చేసుకొని గురు భక్తుల కొండ, దుర్గ భైరవ కొండ, భీమునిగుహ, నీలాచల బోడికొండ మీద కొందండ రామ స్వామినిదర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు భక్తుల దర్శనం కోసం క్యూలైన్లు,బారికేడ్లను, రామ కోనేరులో స్నానాల కోసం ప్రత్యేక ఏర్పాట్లు, తాగు నీటి సౌకర్యం కల్పించారు. సతివాడ పిహెచ్‌సి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. జాతరలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా అడుగడుగునా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. శివరాత్రి సందర్భంగా ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పల నాయుడు కుటుంబ సభ్యులు, జిల్లా ఎస్‌పి ఎం.దీపిక, దేవాదాయ శాఖ కమిషనర్ రామ సత్య నారాయణ, ఉత్సవ ప్రత్యేకాధికారి సురేష్ బాబు దర్శనం చేసుకున్నారు. జాతరలో ఆర్‌డిఒ సూర్యకళ, తహశీల్దారు డి.ధర్మ రాజు పర్యవేక్షణలో దేవస్థానం సహయ కమిషనర్ వై. శ్రీనివాసరావు దగ్గరుండి ఏర్పాట్లను పరిశీలించారు.

శృంగవరపుకోట రూరల్ : మహాశివరాత్రి సందర్భంగా దక్షిణ కాశీగా పేరొందిన పుణ్యగిరి మహా శైవ క్షేత్రం భక్తులతో కిక్కిరిసిపోయింది. మండలంలోని ధర్మవరంలోని సన్యాసయ్య ఆలయం, కొత్తూరు శివాలయం, సీతమ్మపేటలో గల శివాలయం, పట్టణంలో గల రెండు శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పుణ్యగిరికి ఉదయం ఆరు గంటల నుంచే భక్తుల తాకిడి మొదలైంది. పుట్టుదార వద్ద పుణ్యస్నానాలు చేసి శైవక్షేత్ర దర్శనానికి వెళ్ళే భక్తులకు ఎండ తగలకుండా టెంట్లను ఏర్పాటు చేశారు. దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆర్‌టిసి ప్రత్యేక బస్సులను నడిపింది. పలు స్వచ్ఛంద సంస్థలు భక్తులకు అన్నదానం, ఉచిత ప్రసాద వితరణ వంటివి నిర్వహించారు. పోలీస్ శాఖ మూడు వందల మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు చేపట్టింది. మండలంలోని సన్యాసేస్వర స్వామి దేవాలయాన్ని జిల్లా ప్రజా రవాణాధికారి సిహెచ్ అప్పలనారాయణ ఎస్ కోట డిపో మేనేజర్ కె.రమేష్ సందర్శించారు. ఎస్ కోట డిపో నుంచి ప్రతి 20 నిమిషాలకు ఒక బస్సు ఉంటుందని ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు తెలియజేశారు.

పుణ్యగిరిని సందర్శించిన ఎఎస్‌పి జావలి

పుణ్యగిరి ఉమాకోటి లింగేశ్వర స్వామిని ట్రైనీ ఎఎస్‌పి జావలి శుక్రవారం దర్శించుకున్నారు. అనంతరం దేవాదాయశాఖ భక్తులకు కల్పించిన ఏర్పాట్లను ఆమె పరిశీలించారు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పోలీసులు పకడ్బందీగా బందోబస్తు నిర్వహించాలని ఎస్ఐ సిహెచ్ గంగరాజుకు ఆమె ఆదేశించారు.

బొబ్బిలి : మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం పట్టణంలో శివాలయాలు కిటకిటలాడాయి. జంగాలవీధిలో ఉన్న శివాలయాన్ని టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన సందర్శించి పూజలు చేశారు.

వేపాడ : మండలంలోని సింగరాయి, వేపాడ, బానాది, పాటూరు. గ్రామాల్లో మహాశివరాత్రిని ఘనంగా నిర్వహించారు.

5 వేల మందికి అన్న సమారాధన

రేగిడి : మండలంలోని సంకిలి కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయం వద్ద మహా శివరాత్రి సందర్భంగా 5 వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ ఇ.శ్రీనివాసరావు దంపతులు అన్నదానంలో పాల్గొని సేవలందించారు. వీరితోపాటు పోలీస్ సిబ్బంది శివ ఉన్నారు.

పుణ్యగిరిపై బందోబస్తును పరిశీలిస్తున్న ట్రెయినీ ఎఎస్‌పి జావలి

పుణ్యగిరిపై మహిళకు పాము కాటు

శృంగవరపుకోట రూరల్ : పుణ్యగిరిపై ధారగంగమ్మ లోయలో అమ్మవారి విగ్రహం వద్ద శుక్రవారం పూజలు చేస్తుండగా గిరిజన పూజారి గేదెల గంగతల్లి పాముకాటుకు గురైంది. వెంటనే సమీపంలో విధులు నిర్వహిస్తున్న ఎన్‌సిసి క్యాడెట్లు హుటాహుటిన గంగతల్లిని ఎస్.కోటలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు మెరుగైన చికిత్స అందించడంతో గంగతల్లికి ప్రాణాపాయం తప్పింది. దీంతో పుణ్యగిరి ఇఒ, ఉద్యోగులు, కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.

ఆర్‌టిసిపై నిరసన తెలుపుతున్న మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు

కొనసాగుతున్న మిమ్స్ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-నెల్లిమర్ల

తమ సమస్యల పరిష్కారం కోసం మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు చేపట్టిన నిరసన కార్యక్రమం శుక్రవారం మహాశివరాత్రి రోజూ కొనసాగింది. శివరాత్రి సందర్భంగా రామతీర్థం వచ్చిన యాత్రికులకు మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు కరపత్రాలు పంపిణీ చేసి తమ గోడును వినిపించారు. అనంతరం స్థానిక ఆర్‌టిసి వద్ద నిరసన తెలిపారు. మిమ్స్ ఉద్యోగులు, కార్మికుల న్యాయమైన పోరాటానికి అన్ని వర్గాల ప్రజలు సహకరించి మద్దతివ్వాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టి.సురేష్ కోరారు. 37 రోజులుగా పోరాటం చేస్తుంటే మిమ్స్ యాజమాన్యం పట్టించుకోక పోవడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కిల్లంపల్లి రామారావు, యూనియన్ నాయకులు ఎం.నారాయణరావు, మూర్తి, నాగభూషణం, గౌరి, వరలక్ష్మి, కాములనాయుడు, రామకృష్ణ, మధు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల బాండ్ల వివరాలు వెల్లడించకపోవడంపై నిరసనలు : సిపిఎం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఎన్నికల బాండ్ల వివరాలు వెల్లడించేందుకు నిరాకరిస్తున్న ఎస్‌బిఐ (స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) ఎదుట పార్టీ శ్రేణులంతా నిరసన వ్యక్తం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఓవైపు ఎన్నికలు దగ్గరపడుతుంటే, రాజకీయ పార్టీలకు ఇచ్చిన బాండ్ల వివరాలను వెల్లడించేందుకు ఎస్‌బిఐ అధికారులు నెలలు తరబడి సమయం కోరడం సరికాదన్నారు. వెంటనే బాండ్లను బయటపెట్టి ఎస్‌బిఐ తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. అసలు ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమంటూ స్పష్టం చేసిన నేపథ్యంలో ఇటువంటి జాప్యం సరికాదని పేర్కొన్నారు. ఈనెల 11వ తేదీలోపు అన్ని మండలాల్లోనూ నిరసన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు.

ప్రజాతీర్పుతో వైసిపి కనుమరుగు

టిడిపి అభ్యర్థి కోండ్రు మురళీ

ప్రజాశక్తి-రాజాం

రానున్న ఎన్నికల్లో ప్రజాతీర్పుతో వైసిపి ప్రభుత్వం కనుమరుగు అవుతుందని టిడిపి రాజాం నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని 9వ వార్డులోని పలు వీధుల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు పాలన కోసం రాష్ట్ర ప్రజానీకం ఎదురు చూస్తోందన్నారు. నియంత వైసిపి ప్రభుత్వంలో రాష్ట్ర ప్రజానీకం విసుగెత్తి పోయారన్నారు. చంద్రబాబు రూపకల్పన చేసిన సూపర్ సిక్స్ హామీలు, బిసి డిక్లరేషన్‌పై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. అనంతరం కుమ్మర వీధిలో గ్రామదేవతకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి,గాంధీ వీధిలో మహాత్ముని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ రాజాం పట్టణ అధ్యక్షులు నంది సూర్య ప్రకాశరావు, పొట్నా చిట్టి బాబు, టంకాల కన్నం నాయుడు, ఎస్ రమేష్ కుమార్, 9వ వార్డు నాయకులు ఉరిటి సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

నగర పంచాయతీలో చెరువులు, ప్రభుత్వ స్థలాల కబ్జాపై అధికారులు చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక మొయిద జంక్షన్ సమీపంలోని రహదారి పక్కన సర్వే నంబరు 28లో చెరువు ఆక్రమణను పరిశీలించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ పట్టణ నడిబొడ్డున బహిరంగంగా చెరువును అక్రమార్కులు మట్టితో కప్పి కబ్జాకు పాల్పడుతున్నా అధికారులు పట్టించుకోక పోవడం దుర్మార్గమన్నారు. వెంటనే అధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించాలని డిమాండ్ చేశారు .

ఎంపి బెల్లాన జన్మదిన వేడుకల్లో పాల్గొన్న వైసిపి నాయకులు

ఘనంగా బెల్లాన జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-చీపురుపల్లి

ఎంపి బెల్లాన చంద్రశేఖర్ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. వైసిపి చీపురుపల్లి మండల, పట్టణ నాయకుల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. మేజర్ పంచాయతీ, వైసిపి కార్యాలయంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి పెట్టారు. అనంతరం బాపూజీ వృద్ధాశ్రమంలో పండ్లు అందజేశారు. స్థానిక శివాలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు ఇప్పిలి అనంతం, జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు మీసాల వరహాలనాయుడు, జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షులు బెల్లాన వంశీకృష్ణ, పతివాడ రాజారావు, మంగళగిరి శ్రీనివాసరావు, ఇప్పిలి తిరుమల, ఇప్పిలి గోవింద పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి-కొత్తవలస

కొత్తవలస మేజర్ పంచాయతీలోని మంగళవీధికి చెందిన వెలమరెడ్డి కనకరత్నానికి సిఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.50 వేల చెక్కును ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు శుక్రవారం అందించారు. కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ పరిశీలకులు తైనాల విజయ్ కుమార్, ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, జెడ్‌పిటిసి నెక్కల శ్రీదేవి, వైసిపి మండల అధ్యక్షులు ఒబ్బిన నాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు గొరపల్లి శివ పాల్గొన్నారు.


పాల ఉత్పత్తిదారులకు దుప్పట్లు అందజేస్తున్న అధ్యక్షులు గొంప వెంకటరావు

పాల ఉత్పత్తిదారులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బానాది గ్రామంలో విశాఖ డైరీ పాలఉత్పత్తి కేంద్రం-2 పరిధిలోని పాల ఉత్పత్తిదారులకు అధ్యక్షులు గొంప వెంకటరావు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డైరీ సూపర్వైజర్ ఎం.నాయుడుబాబు, పిఎస్ కండి పెళ్లి అప్పలనాయుడు పాల్గొన్నారు.

వృద్ధులకు అండగా హెచ్‌సి కృష్ణమూర్తి

బొబ్బిలి : పేద వృద్ధులకు పార్వతీపురం హెడ్ కానిస్టేబుల్ కె.కృష్ణమూర్తి అండగా నిలిచారు. మండలంలోని గోపాలరాయుడుపేటలో అనారోగ్యంతో బాధపడుతున్న జి.అప్పలనరసయ్య, వై. సింహాచలమ్మ, మరో మహిళకు ఒక్కొక్కరికి 50 కిలోల బియ్యం, దుస్తులు, స్టీల్ గ్లాసులను శుక్రవారం పంపిణీ చేశారు. కృష్ణమూర్తిని ఉపసర్పంచ్ వి.లక్ష్మునాయుడు, మాజీ ఉప సర్పంచ్ ఎస్.సత్యం అభినందించారు.

మహిళలు ఆర్థికంగా బలపడాలి

ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

కొత్తవలసలో మహిళలతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-కొత్తవలస

మహిళలు ఆర్థికంగా బలపడి, సమాజంలో గౌరవంగా బతకాలని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద శుక్రవారం అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలతో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, జిసిసి చైర్‌పర్సన్ స్వాతిరాణి, ఎంపిపి వైస్‌ప్రెసిడెంట్ మాకిశెట్టి కప్పారం, జెడ్‌పిటిసిలు నెక్కల శ్రీదేవి, తుర్రాయి వరలక్ష్మి, ఎంపిపి నీలం శెట్టి గోపమ్మ, వైస్ ఎంపిపి ఆవాల శ్యామల, ఎంఎంఎస్ అధ్యక్షులు సాయిలక్ష్మి కర్రి యశోద పాల్గొన్నారు.

బొబ్బిలి : రోటరీ క్లబ్ అధ్యక్షులు జెసి రాజు చేస్తున్న సామాజిక కార్యక్రమాలకు సంపూర్ణ సహకారం అందిస్తున్న ఆయన సతీమణి పివిఎ మెర్సీరాజును రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సన్మానించారు. రోటరీ క్లబ్ పూర్వ అధ్యక్షులు చంద్రశేఖర్, కోశాధికారి ఎన్.శ్రీనివాస్, సర్వీసెస్ చైర్ జి.శంకరరావు పాల్గొన్నారు. న్యాయమూర్తి సరోజనమ్మను రోటరీ ప్రతినిధులు జె సి రాజు, శ్రీనివాసన్, శంకరరావు ఘనంగా సత్కరించారు. కోటలో మహిళా కౌన్సిలర్లు మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. జనసైనికులు నిలయంలో టిడిపి మహిళా కౌన్సిలర్లు బి.శ్రీదేవి, వి.హైమవతి, మాజీ కౌన్సిలర్ బి.పార్వతిని సన్మానించారు.

కార్యక్రమంలో జనసేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి బాబు పాలూరి పాల్గొన్నారు.

శృంగవరపుకోట రూరల్ : ఆర్‌టిసి ఎస్‌కోట డిపోలో మహిళా కండక్టర్లకు డిపిటిసి సిహెచ్ అప్పలనారాయణ బహుమతులు అందజేశారు. డిపో మేనేజర్ కె.రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రీజినల్ సేఫ్టీ ఇన్స్పెక్టర్ వేణు, సిబ్బంది పాల్గొన్నారు. ఆదిలక్ష్మి జ్యువెలరీ షాప్ యాజమాన్యం ఏర్పాటుచేసిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలలో వైస్ ఎంపిపి సుధారాణి, జెడ్‌పిటిసి వెంకటలక్ష్మి, సర్పంచ్ సంతోష కుమారి, ఎంపిటిసిలు మజ్జి దేవి, వాకాడ సింహాచలం, బొడ్డేటి ఆదిలక్ష్మి పాల్గొని కేక్ కటింగ్ చేశారు.

విజయనగరంటౌన్ : శ్రీ సాయి కృష్ణ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అయ్యన్నపేట జంక్షన్ వద్దనున్న క్లబ్ నడక మైదానంలో క్లబ్ అధ్యక్షుడు తాడ్డి ఆదినారాయణ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ పెద్దలు,వాకర్స్ ఇంటర్నేషనల్ గోల్డ్ డోనర్, 42వ డివిజన్ కార్పొరేటర్ పిన్నింటి కళావతిని ఘనంగా సత్కరించారు. క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ ఎ.ఎస్.ప్రకాశరావు, ఆరికతోట తిరుపతిరావు పాల్గొన్నారు.

సీతంలో ఇంజినీరింగ్ కళాశాలలో..

సీతం ఇంజినీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ సంబరాలు

బొబ్బిలి.. మెర్సీరాజును సత్కరిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

విజయనగరంకోట.. మహిళలను సత్కరిస్తున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అదితి

ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన డాక్టర్ సుష్మ మాటూరు మాట్లాడుతూ పురుషులు, స్త్రీలు ఒకే సమీకరణ ద్వారా జీవితంలో విజయవంతం కాగలరని అన్నారు. కృష్ణా షాపింగ్ మాల్ అధినేత నీతా విజ్ఞాని మాట్లాడుతూ మహిళలు వ్యాపార రంగంలో రాణించాలని అన్నారు. అవని ఆర్గానిక్ డైరెక్టర్ పి. ఉషారాజు మాట్లాడుతూ స్త్రీ పురుషులు సమాన కృషితోనే అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్. మజ్జి.శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి. రామమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ సిహెచ్ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అధ్యాపకులు నిర్వహించిన పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

అశోక్ బంగ్లాలో మహిళా దినోత్సవ వేడుకలు

విజయనగరం కోట : మహిళా దినోత్సవ వేడుకలు టిడిపి కార్యాలయం అశోక్‌బంగ్లాలో శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా టిడిపి-జనసేన ఉమ్మడి అభ్యర్థి పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్విని హాజరైనారు. మహిళలను సమున్నత స్థానంలో ఉంచిన గర్వించదగిన దేశం మనది అని కొనియాడారు. మన రాష్ట్రంలో మహిళలకు ఆస్తి హక్కులో వాటా కల్పించిన ఘనత అన్న ఎన్‌టి రామారావుదే అన్నారు. మహిళలకు రాజకీయ పదవులు కల్పించి పెట్టిన ఘనత కూడా ఆయనకే దక్కుతుందన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందించిన మహిళలను సత్కరించారు. కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

టిడిపిలో గ్రూపులపోరు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

నెల్లిమర్ల నియోజకవర్గంలో టిడిపిలో పతివాడ, కర్రోతు మధ్య గ్రూపులపోరు తారాస్థాయికి చేరుకుంది. పతివాడ, కర్రోతు కుటుంబీకులు మధ్య మాటల యుద్ధం మొదలై.. చినికి చినికి గాలివానలా మారుతోంది. ఇరువురి అభిమానులు, కార్యకర్తలు ఇప్పటికే వాట్సాప్‌లో పోస్టులు పెడుతూ ఒకరినొకరు కించపరుచుకుంటున్నారు. కర్రోతుకు టికెట్ రాకపోవడానికి కారణం పతివాడ కుటుంబీకులేనని ఆరోపిస్తుంటే.. పతివాడను ఇన్‌ఛార్జిగా తప్పించింది మీ అన్నదమ్ములు కాదా? అంటూ అటువైపు నుంచి ఎదురుబాణాలు వేస్తున్నారు. ఈ పరిణామాలు జనసేనకు ఆందోళన కలిగిస్తున్నాయి. టికెట్ కేటాయించినప్పటి నుండి

ఆందోళనలో జనసేన

ప్రచారంలో జోరుపెంచిన జనసేనకు టిడిపిలో గ్రూపులపోరు కంటిమీద కునుకు పట్టనీయని పరిస్థితి నెలకొంది.

నెల్లిమర్ల నియోజకవర్గంలో టిడిపితో పొత్తులో భాగంగా జనసేనకు టికెట్ కేటాయించిన సంగతి తెలిసిందే. పొత్తుధర్మం పాటించాల్సిన తెలుగు తమ్ముళ్ల మధ్య విభేదాలు చోటుచేసుకున్నాయి. మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామి నాయుడుకు కర్రోతు బంగార్రాజు చెక్‌పెట్టి నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాధ్యతలు లాక్కొన్నారని మొదటి నుంచీ పతివాడ కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. సమయం దొరికినప్పుడలా కర్రోతుకు వ్యతిరేకంగా మాట్లాడటం పతివాడ కుటుంబీకులు ప్రారంభించారు. కర్రోతుకు టికెట్ వస్తే ఓటమి తప్పదన్న ప్రచారం కూడా చేశారన్నది పెద్ద ఆరోపణ. ఈ నేపథ్యంలో ఇరు కుటుంబాల మధ్య చాపకిందనీరులా అంతరయుద్ధం సాగింది. పతివాడ నుంచి ఇన్‌ఛార్జి బాధ్యతలు తప్పించి బంగార్రాజుకు ఇవ్వడంతో పతివాడ కుటుంబం ఇబ్బంది పడుతుందని గ్రహించిన టిడిపి అధినాయకత్వం పతివాడ కుమారుడు తమ్మునాయుడుకు రాష్ట్ర కార్యదర్శి పదవిని కట్టబెట్టారు. దాంతో సమస్య సద్దుమణిగిందని అందరూ అనుకున్నారు. కానీ ఇటీవల టికెట్ల పంపిణీలో ఈ నియోజకవర్గాన్ని జనసేనకు కేటాయించారు. దీంతో ఒక్కసారిగా నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్లు అవాక్కయ్యారు. ఆ నిర్ణయాన్ని జీర్ణించుకోలేకపోయారు. బంగార్రాజు కూడా అధిష్టానంపై ఎదురుతిరిగే ప్రయత్నం చేశారు. టికెట్ నిర్ణయం మార్చకపోతే ఇండిపెండెంటుగా పోటీలో ఉంటామని సంకేతాలు అధిష్టానానికి పంపే ప్రయత్నం చేశారు. ఇంతలో పతివాడ కుటుంబం మాత్రం.. అధిష్టానం చెప్పిందే తమకు వేదమంటూ వాట్సాప్‌లో పోస్టులు పెట్టడం ఇరు కుటుంబాల మధ్య విభేదాలకు మరింత ఆజ్యం పోసాయి.

కర్రోతుకు టికెట్ రాకపోవడంతో పతివాడ కుటుంబం సంతోషంగా ఉందన్న వార్త దావానంలా వ్యాపించింది. దాంతో కర్రోతు అభిమానులు పతివాడ కుటుంబీకులపై దుమ్మెత్తిపోస్తున్నారు. 'మీకు సత్తాలేదు.. సత్తా ఉన్న నాయకుడిని అణచేశారు' అంటూ నిప్పులు కక్కుతున్నారు. అక్కడ నుంచి మళ్లీ గ్రూపుల పోరు తారాస్థాయికి చేరిపోయింది. ఇప్పుడు డైరెక్టుగా జనసేన అభ్యర్థితో పతివాడ కుటుంబం చెట్టాపట్టాలు వేసుకొని తిరగడం కర్రోతు గ్రూపునకు మరింత కోపం పెంచేలా చేసింది. ఈ పరిణామాలు జనసేనకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పిల్లి పిల్లి మధ్య గొడవతో రొట్టె జనసేనకు బదులుగా వైసిపి పట్టుకుపోతుందనే ప్రచారం జోరందుకుంది. ఇరు కుటుంబాల మధ్య విభేదాలను సరిచేయడం పెద్ద సవాలుగా మారింది. ఎన్నడూ లేని సమస్య నియోజకవర్గంలో దాపురించిందని టిడిపి అభిమానులు అసహనం చెందుతున్నారు. మింగమంటే కప్పకు కోపం... విడవమంటే పాముకు కోపం అంటూ కార్యకర్తలు అసంతృప్తికి గురవుతున్నారు.

కొండపై తవ్వేసిన కంకర

కంకరతో కాసులు

ప్రజాశక్తి - వేపాడ

కంకర కాసుల వర్షం కురిపిస్తోంది. మండలంలోని నల్లబెల్లి రెవెన్యూ పరిధిలోని గ్రామానికి ఆనుకుని కొండ ఉంది. ఈ కొండను అనుమతులు లేకుండా రాత్రివేళ కొంతమంది అధికార పార్టీ నాయకులు తవ్వేసి కంకర అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. జిల్లా స్థాయి అధికార పార్టీ నాయకులు పేరు చెప్పుకుంటూ సర్వే నెంబరు157లో 68.92 ఎకరాల విస్తీర్ణం కలిగిన కొండను తవ్వేసి వందలాది లారీలతో కంకర తరలించి కాసులు పోగేసుకుంటున్నారు. ఈ విషయంపై గ్రామ రెవెన్యూ అధికారి తాతారావును వివరణ కోరగా పలుమార్లు కంకర తవ్వకాలు ఆపడానికి ప్రయత్నించినా తన మాట పట్టించుకోలేదన్నారు. దీనిపై పై అధికారులకు తెలియజేయడం తప్ప ఏమీ చేయలేకపోతున్నానని చెప్పారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

'గురజాడ'లో మాక్ పార్లమెంట్

మాక్ పార్లమెంటులో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

నగరంలోని గురజాడ పాఠశాలలో శుక్రవారం మాక్ పార్లమెంట్ నిర్వహించారు. విద్యార్థులు రాజకీయ పరిభాష, వాక్చాతుర్యంతో సభికులను అబ్బురపర్చారు. తమ ప్రాంతాల్లోని ప్రజా సమస్యల ప్రస్తావన, వాటికి సమాధానాలు, పరిష్కారాలు చూపడం, సభలో వారు వ్యవహరించిన తీరు విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను ఔరా..! అనిపించింది. ప్రజాస్వామ్య దేశాల్లో అతిపెద్దది భారత పార్లమెంటరీ వ్యవస్థ. కానీ, దేశంలో చాలా మందికి పార్లమెంట్ తీరుతెన్నులపై అవగాహనే లేదనడం అతిశయోక్తి కాదు. చరిత్ర, రాజనీతి పౌరశాస్త్రం, సైన్స్ వంటి అంశాలకు ప్రాధాన్యత తగ్గిస్తూ, వాటి స్థానాల్లో మూఢత్వాన్ని పెంచే పురాణాలు, సమాజ పరిణామ క్రమాన్ని విస్మరింపజేసే పాఠ్యాంశాలు రుద్దుతున్న క్రమంలో విద్యార్థులకు పార్లమెంట్ అంటేనే తెలియని పరిస్థితి దాపురించింది. ఇటువంటి పరిస్థితుల్లో విద్యార్థిదశలోనే పార్లమెంట్‌పైనా అవగాహన కల్పించాలని గురజాడ పాఠశాల యాజమాన్యం సంకల్పించింది. పాఠశాల ఆవరణలో శుక్రవారం నిర్వహించిన ఈ మాక్ పార్లమెంట్‌లో పాల్గొన్న 7,8,9 తరగతుల విద్యార్థులంతా అచ్చంగా ఎంపీలు, కేంద్ర మంత్రుల పాత్రధారణలో పలు అంశాలపై చర్చలు, సంభాషణలతో ఆలోచింపజేశారు. ప్రజాసమస్యపై ఎంపీలు అడిగిన ప్రశ్నలకు సభాపతి ఆదేశాల మేరకు సంబంధిత మంత్రులు సమాధానం చెప్పారు. కార్యక్రమంలో విద్యార్థులంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ డాక్టర్ ఎంవిఆర్ కృష్ణాజీ, కరస్పాండెంట్ ఎం. స్వరూప మాట్లాడుతూ చట్టసభలు, రాజకీయాలపట్ల అవగాహన, రాజ్యాంగం హక్కులు, విలువలు, విశిష్టత విద్యార్థి దశనుంచే తెలియజేయాలన్న లక్ష్యంతో మాక్ పార్లమెంట్ నిర్వహిస్తున్నామన్నారు. ప్రధానోపాధ్యాయులు పూడి శేఖర్ సారథ్యంలో ఈ మాక్ పార్లమెంట్ నిర్వహణ, ఏర్పాట్లు సిబ్బంది చేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నదిపై కర్రల వంతెన ఏర్పాటు

ప్రజాశక్తి-రేగిడి

కర్రల వంతెనపై యువకులు, గ్రామస్తులు

మండలం లోని సరసనాపల్లి గ్రామ సమీపంలోని సువర్ణముఖి నదిపై గ్రామ యువకులు కర్రల వంతెన ఏర్పాటు చేశారు. వంగర మండలం సంగం గ్రామంలో మహాశివరాత్రి నుంచి తొమ్మిది రోజుల పాటు సంగమేశ్వర స్వామి ఆలయం వద్ద జాతర జరుగుతుంది. ఈ జాతరకు యాత్రికులు రావాలంటే మడ్డువలస నుంచి సంగం మీదుగా వ్యయప్రయాసలతో చాలా దూరం ప్రయాణం. అందుకు పలు ప్రాంతాల నుంచి వచ్చిన యాత్రికులకు జోడి బందుల సెంటర్ నుంచి సరసనాపల్లి మీదుగా చాలా దగ్గర ప్రయాణం కావడంతో యువత ముందుకు వచ్చి కర్రల వంతెన ఏర్పాటు చేశారు.. చందాలు ఏర్పాటు చేసుకుని కర్రల వంతెన నిర్మించారు. ఈ వంతెన ఏర్పాటు చేయడం పట్ల యాత్రికులు యువతను అభినందించారు..

వావిలపాడులో 'మేం సిద్ధం'

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని వావిలపాడు గ్రామంలో సర్పంచ్ బీల రాజేశ్వరి ఆధ్వర్యంలో శుక్రవారం మేం సిద్ధం.. మా బూత్ సిద్ధం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి మండల అధ్యక్షులు ఎం.జగ్గుబాబు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అన్నీ మళ్లీ అందరికీ అందాలంటే... జగన్మోహన్‌రెడ్డిని మళ్లీ సిఎంను చేయాలన్నారు. ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుని మళ్లీ గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బీల సతీష్, ద్వారపూడి గంగు నాయుడు, గండి శ్రీరామ్మూర్తి, బి శంకర్రావు, సుభద్రమ్మ, దేవుడి నాయుడు, బి.వెంకటరావు, బి.శ్రీను, జి.వెంకట్రావు, నాగిరెడ్డి రాజు నాయుడు, సంతోష్ పాల్గొన్నారు.

కలలకు రెక్కలు.. మహిళలకు వరం

ప్రజాశక్తి-విజయనగరం కోట

అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున మహిళా సాధికారత దిశగా టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు , జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ కీలక ముందడుగు వేశారని నియోజకవర్గ ఇంఛార్జి పి.అదితి గజపతి, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్విని అన్నారు. అశోక్‌బంగ్లాలో మహిళలతో ఏర్పాటు చేసిన సమావేశంలో 'కలలకు రెక్కలు' పథకం గురించి వివరించారు. రాష్ట్రంలో ఏ ఆడబిడ్డ కూడా చదువుకు సంబంధించి డబ్బుల కొరతతో ఇంటికి పరిమితం కాకుకూడదనే ఆలోచనతో నూతన పథకాన్ని తీసుకుని వచ్చారని అన్నారు. మహిళలకు వత్తిపరమైన విద్యకు మార్గాలను అందించడంతో పాటు వారికి మరింత ఉపాధి అవకాశాలు కల్పించడం ఈ పథకం ప్రధాన లక్ష్యమన్నారు. ఇంటర్ పూర్తి చేసిన మహిళలు ఈ పథకం కింద దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. మహిళలు తీసుకునే బ్యాంకు లోన్ కు తెలుగుదేశం - జనసేన ఉమ్మడి ప్రభుత్వం బాధ్యత (హామీ) వహిస్తుందన్నారు. అర్హత ఉన్న మహిళలందరూ దేశంలో ఎక్కడైనా తమకు నచ్చిన ప్రొఫెషనల్ కోర్సులను అభ్యసించవచ్చునని అదితి విజయలక్ష్మి గజపతి వివరించారు.

బొబ్బిలి : మహిళా సాధికారత కోసమే కలలకు రెక్కలు పథకాన్ని టిడిపి-జనసేన కూటమి ప్రకటించిందని టిడిపి మహిళా కౌన్సిలర్లు బి.శ్రీదేవి, వి.హైమావతి, బి.ధనలక్ష్మి అన్నారు. స్థానిక కోటలో శుక్రవారం మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో ఏ ఒక్క మహిళా చదువుకు, తమ లక్ష్యాలకు దూరంగా ఉండకూడదని చంద్రబాబు, పవన్ కళ్యాణ్ పథకాన్ని ప్రకటించారన్నారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన ప్రతి మహిళకూ కళలకు రెక్కలు కింద రుణాలు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బి.పార్వతి ఉన్నారు.

గుండెపోటుతో రాములు మాస్టారు మృతి

ప్రజాశక్తి-బొబ్బిలి

విశ్రాంత ప్రధానోపాధ్యాయులు డోకుల రాములు మాస్టారు గుండెపోటుతో శుక్రవారం ఉదయం మృతి చెందారు. శివాలయం వీధిలో ఉంటున్న రాములుకు గుండెపోటు రావడంతో ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లారు. మెరుగైన వైద్యం కోసం వైద్యులు విశాఖ రిఫర్ చేయడంతో ప్రయివేట్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో ఆయన మరణించారు. పొట్టి శ్రీరాములు మున్సిపల్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా రాములు పని చేసి ఉద్యోగ విరమణ చేశారు. విజేత స్కూల్‌ను స్థాపించి ఎంతోమందిని ఉన్నతులుగా తీర్చిదిద్దారు. ఎపిటిఎఫ్‌లో చురుకైన పాత్ర పోషించేవారు. రాములు మృతికి పట్టణ ప్రముఖులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఆయన శిష్యులు సంతాపం తెలిపారు.

రాములు (ఫైల్)

CHANGE OF SURNAME

I, Chukka Ramakoteswara Rao, Service No. JC-706811N, Resident of Door No.1-98/1, Kannam Village, Dattirajerru Mandal, Vizianagaram District. In my army service records my Father, wife & son surname were wrongly mentioned as **CH.KANNATALLI (Wife), CH.KUMAR NAIDU (Son) & SATYAM (Father)**, but their correct surname were **CHUKKA KANNATALLI (Wife), CHUKKA KUMAR NAIDU (Son), & CHUKKA SATYAM (Father)** For all practical purposes.

డాక్యుమెంట్ పోయినది

తేది 20-12-2023న విజయనగరంలో అయ్యకోనేరు దక్షిణ గట్టున ఉన్నటువంటి మా ఇంటి నుండి రిజిస్ట్రార్ ఆఫీస్ (దాసన్నపేట) నందు ఉన్న జెరాక్స్ సెంటర్‌కు మా ఒరిజినల్ డాక్యుమెంట్స్ పట్టుకొని జెరాక్స్ తీయించుటకు వెళ్లియున్నాము. అయితే అక్కడ నుండి తిరిగి వస్తున్న సమయంలో నా ఒరిజినల్ డాక్యుమెంట్ మా అమ్మగారు మూలా లక్ష్మీకాంతం మరియు మూలా అనసూయ పేరున రిజిస్ట్రర్ అయిన సేల్‌డీడ్, డాక్యుమెంట్ నెం.2664/1973 పోయినది. కావున సదరు దస్తావేజు ఎవరకైనా దొరికినచో క్రింది అడ్రసుకు అందజేయవలసినదిగా కోరుచున్నాను.

మూలా శరత్ చంద్ర ప్రసాద్
D.No-19-9-15, అయ్యకోనేరు దక్షిణ గట్టు,
విజయనగరం, సెల్ : 8008108676

IN THE COURT OF THE HON'BLE ADDITIONAL SENIOR CIVIL JUDGE, NARASARAOPET,PALNADU (DIST,)A.P.
OS No. 4/2021

Between:
Tirumala Milk Products Pvt. Ltd., rep by its Legal Manager,Narasaraopet
...Petitioner / Plaintiff
And
Chalumuri srinivasu (died) and others
Chalumuri Saraswathi W/o late Srinivasu A/35 yrs, House wife, D.No:8-4, Plot No.40, Gollalapeta, industrial Estates, Vijayanagaram Town and Mandal and District, A.P. .... Respondents / Defendants

పై నెం.దావా నందు చలుమూరి శ్రీనివాసు S/o కృష్ణ అనే అతనిపై తిరుమల మిల్క్ ప్రొడక్ట్స్ వారు ఓ.ఎస్ నెం. 4/2021 గా ప్రామిసరీ నోటు దావా వేసియున్నారు. సదరు దావా నందు చలుమూరి శ్రీనివాసు తండ్రి కృష్ణ అను చనిపోయినారు. కావున ఆయన భార్యగారు అయిన చలుమూరి సరస్వతిని డిఫెండెంట్/D2 గా చేర్చడమైనది. సదరు దావా నెం. 4/2021 లో శ్రీ యుత పై కోర్టు వారి ద్వారా D2 అయిన చలుమూరి సరస్వతికి పలుమార్లు సమన్లు జారీ చేసినను మీరు తీసుకోని కారణంగా శ్రీయుత కోర్టువారి ద్వారా పేపరు పబ్లికేషన్ / సబ్టిట్యూట్ సర్వీస్ ద్వారా మీకు తెలియజేయడమైనది. ది.27-03-2024 న పై కోర్టువారి యెదుట హాజరై మీకు గల ఆక్షేపణలను మీరుగాని మీ తరపున న్యాయవాది గాని ఉదయం 10-30 గం.లకు శ్రీయుత కోర్టువారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలను తెలుపుకొనగలరు. లేనియెడల మీకు పరోక్షముగా తీర్మానించబడునని ఇందుమూలంగా మీకు తెలియజేయడమైనది. శ్రీయుత కోర్టువారి ద్వారా ఈ పేపరు పబ్లికేషన్స్ వేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు
వాయిదా. 27-03-2024
P.CHAKRAPANI, B.Com, LL.B.,
Advocate, Station Road,
Narasaraopet. Cell :9885644203